క్లుప్తంగా

విద్యతోనే బంగారు భవిష్యత్తు



విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న బ్రహ్మానంద ఆచారి

బనగానపల్లె రూరల్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని.. బడి ఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలో ఉండాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి అన్నారు. సోమవారం మండలంలోని బీరవోలు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల నుంచి 14 ఏళ్లలోపు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం హుస్సేన్‌బాషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలి

బనగానపల్లె రూరల్: క్యాన్సర్, షుగర్, హైపర్ టెన్షన్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని బనగానపల్లె ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత అన్నారు. సోమవారం స్థానిక వంద పడకల వైద్యశాలలో ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓలకు క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రొమ్ము క్యాన్సర్‌పై గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు సరైన అవగాహన లేదన్నారు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం ద్వారా నయం చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు ప్రశాంతి, టి.పద్మజ క్యాన్సర్ రకాలు, లక్షణాలు, గుర్తించే విధానాలను వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీలు గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

ఆడపిల్ల చదువు.. ఇంటికి వెలుగు

సంజామల: తల్లిదండ్రులు మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సుగుణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడపిల్లలను బాగా చదివిస్తే అన్ని రంగాల్లో రాణించగలరని తెలిపారు. ఇంటికి వెలుగునిస్తారన్నారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ సీతారామమ్మ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి బైక్ ధ్వంసం



బైక్ సీటును కోసేసిన దృశ్యం

డోన్ టౌన్: రాజకీయ కక్షతో గుర్తు తెలియని వ్యక్తులు వైఎస్సార్‌సీపీ నాయకుడి బైక్‌ను ధ్వంసం చేశారు. డోన్ మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మధన్‌యాదవ్‌కు చెందిన బుల్లెట్ బైక్‌ను పట్టణంలోని పాతపేటలో తన ఇంటి ముంగిట నిలిపిఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు బైక్ సీట్లు, ట్యాంక్ కవర్‌ను బ్లేడ్‌తో కోసివేశారు. అలాగే నంబరు ప్లేటును ధ్వంసం చేశారు. ఇది ముమ్మాటికీ టీడీపీ కార్యకర్తల పనే అని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. పాతపేట అమ్మవారిశాల ప్రాంతంలోని సీసీ కెమెరాల పుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని బాధితుడు కోరుతున్నారు.

30న మండల మీట్

బనగానపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. ఎంపీపీ మానస వీణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులతో పాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పక హాజరుకావాలని సూచించారు.

మిస్సింగ్ కేసు నమోదు

అవుకు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం మిస్సింగ్ కేసు నమోదు అయినట్లు ఎస్‌ఐ కిరణ్ బాబు తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రకారం మండల కేంద్రం అవుకులోని మార్కెట్ వీధికి చెందిన 17 సంవత్సరాల యువతి వేకువజామున 5.30 గంటలకు ఇంటి బయట చెత్త ఊడ్చటానికి వెళ్లి కనిపించలేదని యువతి తండ్రి గోవిందిన్నె నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

అవుకు: మండల పరిధిలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ సూచించారు. సోమవారం అవుకులోని రైతు భరోసా కేంద్రంలో వీఏఏ, వీహెచ్‌ఏలతో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామాల్లో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగు అవుతున్నాయో ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలన్నారు. పీఎం కిసాన్ ఫిజికల్ వెరిఫికేషన్ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

వ్యాధుల కాలం.. జీవాలు భద్రం

- వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం
- జిల్లాలో 11.07 లక్షల మేకలు, గొర్రెలు
- జాగ్రత్తలు తీసుకోకపోతే జీవాల ప్రాణాలకే ప్రమాదం
- పశువైద్యాధికారుల సూచనలు పాటించాలి
- జీవాలకు టీకాలు వేయించడం ఉత్తమం

వర్షాకాలం మొదలైందంటే చాలు జీవాలకు వ్యాధులు సోకుతుంటాయి. ఈ సీజన్‌లో పశువులు, గొర్రెలు, మేకలపై ఆరోగ్యంపై ఓ కంట కనిపెడుతుండాలి. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యం చేయించాలి. లేకుంటే జీవాలు మృత్యువాత పడే అవకాశాలు ఉంటాయి. ఎప్పటికప్పుడు పశువైద్యాధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా వ్యవహరించాలి. ముందస్తుగా టీకాలు వేయించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.



కుందూనదిలో నీరు తాగుతున్న జీవాలు



వ్యాధులు సోకుకుండా జీవాలకు టీకాలు వేస్తున్న పశువైద్యుడు

కోవెలకుంట్ల: వానా కాలంలో వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటే పశువులు, జీవాలకు ప్రాణహాని కలగకుండా కాపాడవచ్చని పశు వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ఆయా వ్యాధుల గురించి తెలుసుకుని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 8,82,449 గొర్రెలు, 3,05,834 మేకలను పెంచుకుంటూ గొర్రెల పెంపకందారులు జీవనం సాగిస్తున్నారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో నెల రోజుల నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల వల్ల జీవాలకు పలు రోగాలు ప్రబలే అస్కారం ఉందని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారులకు చెబుతున్నారు.

చిటుకవ్యాధి ప్రమాదకరం

గొర్రెల్లో ఎక్కువగా సోకే వ్యాధి ఇది. తొలకరి వర్షాలు కురిసే సమయంలో ఈ వ్యాధి గొర్రెలకు సోకుతుంది. ఏడాది వయస్సు గల గొర్రెలకు ఎక్కువగా ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి సోకిన తక్కువ సమయంలోనే గొర్రెలు మృత్యువాత పడతాయి. వ్యాధి సోకిన వెంటనే గొర్రెలు నీరసించి కొద్దిసేపటికే గిలగిల కొట్టుకుని మరణిస్తాయి. వ్యాధి లక్షణాలు ఉదయం, మధ్యాహ్న వేళల్లో కనిపిస్తాయి. వర్షాలకు ముందే గొర్రెలకు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన గొర్రెలను మంద నుంచి వేరు చేయాలి.

నోటిపుండ్ల లక్షణాలు

మేకల్లో బ్లూటరింగ్ వ్యాధి సోకితే ఎక్కువగా జ్వరం, మూతివాపు, పెదవులు వాయడం, నోటిలోపల పుండ్లు, ముక్కులో చీమిడి, కాళ్లు కుంటడం, ఒంట్లో నీరు చేరుకోవడం, పారుకోవడం, మేత మేయకపోవడం, చూడు పశువులు అయితే ఈసుకపోవడం, తదితర లక్షణాలు కన్పిస్తాయి. ఈ వ్యాధి సోకిన జీవాల్లో 30 శాతం వరకు మరణాలు సంభవించే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి నివారణకు సాయంత్రం సమయంలో గొర్రెల మందకు వేపాకు పొగ పెట్టుకుంటూ అప్పుడప్పుడు బ్లూటాక్స్ టిక్కెల్ మందులు పిచికారీ చేస్తూ పాడి ప్రదేశాల్లో మందను తోలుకోవాలి.

కాళ్లపుండ్ల వ్యాధి

జీవాలకు కాళ్లపుండ్లవ్యాధి సోకితే కాలిగిట్టల మధ్య చీము చేరి చెడువాసన వస్తుంది. ఈ వ్యాధి సోకిన జీవాలు కుంటుతూ నడుస్తాయి. ఈ లక్షణాలు కన్పించినప్పుడు జీవాలను బురద ప్రాంతాల్లో మేపకూడదు. పాడి ప్రాంతంలోనే మేత వేసే విధంగా చూడాలి.

గొంతువాపువ్యాధి

జీవాలకు సోకే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రధానమైంది. ఇది చాలా ప్రమాదకరమైన వ్యాధి. ఈ వ్యాధిని గురకవ్యాధి అని కూడా పిలుస్తారు. వర్షాకాలంలో జీవాలకు సూక్ష్మజీవుల ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. తొలకరి వర్షాలు పడిన సమయంలో కలుషితమైన నీరు, మేత ద్వారా జీవాలకు సోకి రోగ నిరోధక శక్తి తగ్గి మరణిస్తాయి. వ్యాధిబారిన పడిన జీవాలను మిగిలిన జీవాలతో కలిపి ఉంచితే ఈ వ్యాధి మిగిలిన జీవాలకు వ్యాప్తి చెందుతుంది. ఒకే పాకలో మిగతా జీవాలతో ఉంచకుండా వేరుగా ఉంచాలి. అలాగే వర్షాకాలంలో జీవాలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జూన్, జులై, ఆగస్టు నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. జీవాలకు ఎప్పటికప్పుడ పౌష్టికాహారం అందించాలి. జీవాలు నివాసం ఉంటున్న పాకలను శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి



సీజనల్ వ్యాధులపై గొర్రెల కాపరులు, పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలి. లక్షణాలు తెలియకుంటే జీవాలకు ఆయా వ్యాధులు సోకి మరణించే అస్కారం ఉంది. ముందుగానే ఆయా వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్యాధికారులను సంప్రదించాలి. వైద్యుల సూచనలు, సలహాలతో మందులు వాడితే ఆయా వ్యాధుల బారినుంచి జీవాలను కాపాడుకోవచ్చు. జీవాలకు వ్యాధులు సోకినట్లు గుర్తిస్తే దగ్గరిలోని పశువైద్యశాలలకు జీవాలను తీసుకొచ్చి సకాలంలో వైద్యం అందిస్తే ప్రాణాపాయం నుంచి కాపాడుకోవచ్చు.

–కృష్ణకుమార్, పశువైద్యాధికారి, కోవెలకుంట్ల

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కోవెలకుంట్ల వసతి గృహంలో స్టోర్‌రూంను పరిశీలిస్తున్న తహసీల్దార్

కోవెలకుంట్ల: వసతి గృహాల్లో ఉంటూ వివిధ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ జయప్రకాష్ అన్నారు. సోమవారం పట్టణ శివారులోని గురుకుల పాఠశాల, ఎస్సీ బాలికల, బీసీ బాలుర, గుళ్లదూర్తి బీసీ బాలుర వసతి గృహాలను తనిఖీ చేశారు. ఆయా వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజన వసతి కల్పిస్తున్నారా, లేదా అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. వంట గదుల్లోకి వెళ్లి కూరగాయలు, నిత్యావసర సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి, ఆయా వసతిగృహాల వార్డెన్లు వనజాక్షి, చైతన్య లక్ష్మి, ఎర్రమ్మ, వీఆర్‌ఓలు చెన్నయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెనూ పాటించాలి



బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి

ప్యాపిలి: ప్రభుత్వ వసతి గృహాల్లో వార్డెన్లు తప్పనిసరిగా ప్రతి రోజూ మెనూ అమలు చేయాలని తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి ఆదేశించారు. స్థానిక బీసీ బాలుర, కేజీబీవీ పాఠశాలలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. వార్డెన్లు తప్పనిసరిగా వసతి గృహంలో అందుబాటులో ఉండాలన్నారు. వసతి గృహాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. భోజనం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు వడ్డించే భోజనం రుచికరంగా, నాణ్యతగా ఉండాలని ఆదేశించారు. వసతి గృహాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. డీటీ మారుతి, వీఆర్వో సోమశేఖర్ తదితరులు ఉన్నారు.

వ్యాధుల నియంత్రణపై అత్యవసర సమావేశం



మాట్లాడుతున్న కమిషనర్ జయరామ్

డోన్ టౌన్: డయేరియా వ్యాధిని నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా పోగ్రామ్‌కు ప్రతి శాఖ వారు సహకరించాలని కోరారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్ఎస్, జింక్ మందులను ఇంటింటికీ సరఫరా చేస్తామన్నారు. మంచినీటిని వేడిచేసి వొడపోసి చల్లార్చి తాగాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మల విసర్జన తరువాత, అలాగే భోజనానికి ముందు, తరువాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, నీళ్ల విరేచనాలు అయితే వెంటనే డాక్టరును సంప్రదించాలని వార్డు కార్యదర్శులు ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించాలన్నారు. డెంగ్యూ, మలేరియా తదిరత సీజనల్ వ్యాధుల నివారణపై స్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, పొదుపు సంఘాల మహిళలు విరివిగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మండల విద్యాధికారి ప్రభాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మున్సిపల్ ఇంజినీర్ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహ్మద్‌బాషాతో పాటు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, నర్సులు, తదితరులు ఉన్నారు.

ఎంపీపీ పాఠశాల మూసివేత



పాఠశాలకు తాళం వేసిన దృశ్యం

బనగానపల్లె: పట్టణంలోని పంచమపేట ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో అధికారులు మూసివేశారు. పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు ఉండగా 3 నుంచి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థులను జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు విలీనం చేశారు. 1 నుంచి 2వ తరగతి వరకు కొందరు విద్యార్థులు ఉండగా పాఠశాలకు రాకపోవడంతో మూసివేశారు. ఈ విషయంపై ఎంఈఓ స్వరూప మాట్లాడుతూ.. పాఠశాల మూసివేసిన విషయం వాస్తమే అన్నారు. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నందున జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు కొన్ని తరగతులను ఎంపీపీ పాఠశాలకు మార్పు చేయడం జరుగుతుందన్నారు. 1 నుంచి 2వ తరగతి విద్యార్థులను కూడా పాఠశాలలో చేర్పిస్తామని తెలిపారు. పాఠశాలకు కాంపౌండ్‌వాల్ నిర్మించడంతో పాటు టాయిలెట్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

వసతి గృహాల తనిఖీ



హాస్టల్‌లో సౌకర్యాలపై ఆరాతీస్తున్న తహసీల్దార్

డోన్ టౌన్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి పట్టణంలోని వసతి గృహాలతో పాటు పలు గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ సమీపంలోని మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ, గురుకుల బాలికల పాఠశాలతో పాటు పట్టణంలోని ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. పాఠశాలల్లో భోజన వసతి, సదుపాయాలు, మెనూ అమలు, సౌకర్యాలు, పుస్తకాలు, సామగ్రి తదితర వాటిపై విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. సహాయ గణాంకాధికారి మునిస్వామి, వీఆర్వోలు రాజు, గంగాధర్ వెంట ఉన్నారు.

ఏకగ్రీవ ఎన్నిక

డోన్ రూరల్: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోషియేషన్ డోన్ తాలుకా యూనిట్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం డోన్, ప్యాపిలి, కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో పనిచేస్తున్న మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న మినిస్టరీయల్ సిబ్బంది హాజరై డోన్ తాలుకా సిబ్బందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.నాగరాజు (డోన్ ఓఏ), ఉపాధ్యక్షుడిగా బి.లలిత (ఏఓ, వెల్దుర్తి), జనరల్ సెక్రటరీ ఎం.శ్రీనివాసులు నాయుడు, ట్రెజరర్ కె.మాధవరెడ్డి, జాయింట్ సెక్రటరీ బి.సురేష్‌బాబు, డిస్టిక్ కౌన్సిలర్లు పార్థసారథి, రామాంజినేయులు ఎన్నికయ్యారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటాం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని

కొలిమిగుండ్ల: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడుతున్నారని.. పార్టీ నాయకులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. సోమవారం తుమ్మలపెంట సమీపంలో అల్ట్రాటెక్ సిమెంట్ సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కనుసన్నల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తుమ్మలపెంట నుంచి సాయిబాబా గుడి వరకు వాటర్ సమస్య ఎక్కువగా ఉండడంతో అల్ట్రాటెక్ కంపెనీ రోడ్డు విస్తర్ణ పనులను వైఎస్సార్‌సీపీ నాయకుడు తోట మల్లేశ్వరరెడ్డికి అప్పగించిందని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారనే నేపంతో మంత్రి బీసీ ఆర్అండ్‌బీ అధికారులతో మల్లేశ్వరరెడ్డి, అల్ట్రాటెక్ యాజమాన్యంపై కేసు పెట్టించినట్లు చెప్పారు. పోలీసు వ్యవస్థ అధికార పార్టీకి ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నాయకులు దాడులు చేస్తే కేసులు నమోదు చేయకుండా ఉచిత సలహాలు ఇవ్వడం మంచి పద్ధతి కాదన్నారు. పార్టీ శ్రేణులపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చాక అభివృద్ధి చేయాల్సింది పోయి దాడులు చేయడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, నాయకులు కాటసాని తిరుపాల్‌రెడ్డి, యాతం పెద్దిరెడ్డి, లాయర్ మహేశ్వరరెడ్డి, పేరం సత్యనారాయణ రెడ్డి, మొలక రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

ప్యాపిలి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చేపట్టిందని తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ సాయి మనోహర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీలు సమర్పిస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమస్యలపై అర్జీ సమర్పించే వారు ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ తప్పనిసరిగా పొందుపర్చాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేడుకగా ప్రదోష కాల పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రదోషకాల పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఏకశిలారూపంలోని శివపార్వతులకు అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రదోష కాల పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



తరగతి గదిలో విద్యార్థులు



వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు

వ్యయ మాసం

- అటు రైతులకు, ఇటు విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం
- ఏటా పెరుగుతున్న ఎరువులు, విత్తనాల ధరలు,
- సౌకర్యాల పేరుతో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల పెంపు
- విలవిల్లాడుతున్న సామాన్యులు

బేతంచెర్ల: ఏటా జూన్ మాసం వచ్చిందంటే ఇటు ఖరీఫ్ ప్రారంభం పురస్కరించుకొని రైతన్నలు పొలం పనుల్లో బిజీగా ఉంటారు. అలాగే కొత్త విద్యా సంవత్సరం కూడా ఇదే నెలలో ప్రారంభం అవుతుంది. వ్యవసాయానికి విత్తనాలు, సేద్యం పనులు, కూలీల ఖర్చులు రైతన్నలకు, పిల్లలను బడిలో చేర్పించేందుకు ఫీజులు, విద్యా సామగ్రి కొనుగోలు తదితర ఖర్చులు విద్యార్థుల తల్లిదండ్రులకు షరామామూలే. పాత రోజుల్లో వ్యవసాయానికి మాత్రమే ఆర్థిక భారంగా ఉండే జూన్ నెల, క్రమంగా విద్యావ్యవస్థలో మార్పులు చోటు చేసుకొని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు రావడంతో సామాన్యులపై మోయలేని గుదిబండగా మారింది. ఏటికేడు విత్తనాలు, ఎరువుల ధరలు పెరగడం, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు, స్పెషల్ ఫీజులు, యూనీఫాంలు, నోట్ పుస్తకాల కొనుగోలుతో జూన్ నెల విద్యార్థుల తల్లిదండ్రులకు భారంగా మారింది. కార్పొరేట్ పాఠశాలల్లో చదివితే పిల్లలు ప్రయోజకులవుతారనే ఉద్దేశంతో కొంతమంది తల్లిదండ్రులు తమ శక్తికి మించి ఫీజులు చెల్లిస్తూ ఆ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. అత్యాధునిక విద్య పేరుతో వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తుండటంతో జూన్ నెల వచ్చిందంటే అటు రైతన్నలు, ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురికావాల్సిన పరిస్థితి నెలకొంది. రైతు కుటుంబాల్లో చదువుకునే పిల్లలు ఉంటే ఆ తల్లిదండ్రులు బాధ వర్ణనాతీతం. పాలక ప్రభుత్వాలు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు తక్కువ ధరకు అందుబాటులో ఉంచడమే గాకుండా, మారుతున్న కాలనుగునంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక విద్యను ప్రవేశపెడితే బడుగు బలహీన వర్గాల వారికి జూన్ నెల ఆర్థిక భారం నుంచి ఉపశమనం కలిగించిన వారవుతారని పలువురు పేర్కొంటున్నారు.

నేడు డోన్‌కు మాజీ మంత్రి రాక

డోన్ టౌన్: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం డోన్‌కు వస్తున్నట్లు మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు సోమవారం తెలిపారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

ముచ్చట్ల మల్లికార్జున స్వామికి పూజలు



శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసి, మూడు కోట్ల దేవతలు ముచ్చటించుకున్న ప్రాంతంగా ప్రసిద్ధికెక్కిన్న శైవ పుణ్యక్షేత్రమైన ముచ్చట్ల భ్రమరాంబా, మల్లికార్జున స్వామి ఆలయంలో జ్యేష్ఠ మాసం సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముచ్చట్ల భ్రమరాంబా, మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.